# కానుఁగుచెట్టు

పానుగంటి లక్ష్మీనరసింహారావు పంతులు గారు

నక్కదోసకాయ యూరఁగాయ. గోఁగుకూరపచ్చడి. బఱ్ఱెపెరుఁగు అంతే. అంతకంటె నక్కడ నేమిదొఱకును? అవే పంచభక్ష్య పరమాన్నములు. ఇట్లనుదినము వేళపాళయని లేక కొన్నిపాటి సుబ్బరాజుగారన్నప్రదాన మాచరించుచుండిరి. అన్నము జొన్నయన్నము. విస్తరి బొడ్డుమేడియాకువిస్తరి. ఉప్పు జాతియుప్పు. నీరు దిగుడుబావినీరు. ఇప్పటిమాటయా? దాదాపుగా నూఱేండ్ల క్రిందటిమాట. ముప్పదిసంవత్సరము లిట్లా బ్రాహ్మణుఁడన్నప్రదాన మొనర్చినాఁడు. మహానుభావుఁడు. నిర్గర్వుఁడు. నల్వురు మోయఁదగిన చొప్ప మోపును తానే పొలమునుండి తలపైఁ బెట్టుకొనితెచ్చి బఱ్ఱెలకు వేయును. వానిపాలు పాలికాఁపులచేఁ బిదికింపక తానే పిదుకును. ఇంట నందఱ కాతని భార్యయే వంట చేయును. వంటలక్కలు కాని నీళ్ల బ్రాహ్మణులుకాని వారి కెవ్వరును లేరు. ఉంచుకొనవలసిన యావశ్యకతయు వారికి లేదు. తమయింటిపని నొకరిచేఁ జేయించుట వారు తప్పుగ భావించుచుండెడివారు. పచనాదికృత్యములను బైవారిచేఁ గూలిపెట్టి చేయించినయెడల నతిథిపూజాఫలము పరిపూర్ణముగఁ దమకు సిద్ధింపదేమో యని వారికి భయము. పాలుమాలిక లేక, యొడలు దాఁచుకొనక భూతసంతుష్టిచేయుటయే పుణ్యకార్యమని నమ్మి వారట్లు చేసిరి.

మగనికిఁ దనకుఁ దవ్వెఁడుబియ్యము కుతకుతలాడించుటకే యీ కాలపుఁ గులకాంతల కోపిక లేదు. దొడ్డిలో దాసి. వీధిగుమ్మములో సేవకుఁడు. ఇంటిలో వంటలక్క. ఇంతపై బలగమున్నఁగాని యాలుమగని కంటె నెక్కువలేని యిద్దఱ కాపుర మీ దినములలోఁ గడతేఱకుండ నున్నది. పంచపాళిలో నాఱవైచినబట్ట భటునిపాలు. పెరటిలోఁ బాఱవైచిన తప్పెల దాసిపాలు. పడమటింటిలోని పప్పునేయి సామాను బాపనక్కపాలు. అమ్మగారు పడుకటింటిలో నారంగజేబు నవలను జదువుచు నావులింతలపాలు. అయ్యగారు రణాబిల్లపై సంతకములతో నప్పులపాలు. ఇంతేకదా యిప్పటి సంసారముల సౌభాగ్యము! అతిథిపూజలేదు సరేకదా-పతివిస్తరిలోఁ బచ్చడి మెదుకులయినఁ జేసిపెట్టినదేది? వంటబ్రాహ్మణియొద్దఁ గూరుచుండునెడల మొగము మెరుఁగు కరఁగిపోవునప్పుడు మగనిమొగాన నింక మొద్దులేకాని మఱియేమున్నది? ప్రాసయతి మంజరీద్విపదలో నుండవచ్చునో లేదో తెలియును గాని, పప్పుడికిన తరువాత నుప్పు వేయవలయునో - యుడుకక ముందు వేయవలయునో- తెలియదు. ఉండలు జిల్లెడుగాయలు కాకుండ నత్తెసరు వేయఁగల యమ్మగారన్నపూర్ణాదేవిగారు. వంటయింటిలోని ప్రాణాహుతులతోను బజారులోని కారపుఁ బూసతోను గాపురము లెట్లో జరుగుచున్నవి. జరుగక మానునా? కాలచక్రము నెవరడ్డగలరు? అదియు వుండగా నెవరేమి చేయఁగలరు? మగలబ్రదుకులే యిట్లు దిగనాఱునప్పుడు మఱఁదుల బావల యత్తల బ్రదుకు లడుగవలయునా?

కాని యాహా! ఏమిదుర్గమ్మ!! దూపాటి సీమనుండి వచ్చినవాఁ డొకఁడు. నల్లమలనుండి వచ్చినవాఁ డొకడు. కోనసీమనుండి వచ్చినవాఁ డొకఁడు. పలనాటి సీమనుండి వచ్చినవాఁ డొకఁడు. ఇట్లెందఱో యతిథులై రాగా, వారి కందఱకు బహుపరిశుభ్రముగా వండి, భర్త కుట్టి సిద్ధపఱచి యుంచిన యాకులలో వడ్డించి, వారు సంతుష్టిగ భుజించినతరువాతఁ దాను భుజించును. ఇట్లొక్కదినమా? ఒక్కమాసమా? ఒక్క సంవత్సరమా? ఆఁడుదాని పరిపూర్ణసహాయ్యము లేకుండ బ్రహ్మదేవుఁడైన నన్నప్రదాన మాచరింపలేఁడు. అన్నప్రదానపుణ్య మంతయు నంగనదే!

ఇఁక నీయతిథులకు సాయంకాలమున మూఁడుగంట లగుటతోడనే—ఆనవుఁగాయదినములలో తంపటివైచిన యనుపగుగ్గిళ్లు - లేఁజొన్నకంకులదినములలో నూచబియ్యము-మొక్కజొన్న పొత్తుల కాలములో మొక్కజొన్న పొత్తులు - ఇట్లు ఏయేకాలములో నేది వచ్చునో-యది యల్పాహారముగ వారియెదుటఁ బెట్టి తాను చేగునపమంత గంటము చేతఁ బుచ్చుకొని, తాటియాకులపై భాగవతమో హరివంశమో మఱేదియో యా సుబ్బరాజుగారు వ్రాసికొనుచుండును. ఇట్లాతఁ డెన్నిగ్రంథములో వ్రాసినాఁడు. కవీశ్వరు లాతనికిఁ గన్నులఁ గట్టినట్లుందురు. తిక్కన సోమయాజి యాఱడుగుల పొడవగువాఁడని-గడ్డముక్క కలవాఁడని-నడుముకట్టులోఁ జురకత్తి కలవాఁడని-కాలిన మొక్కజీడిపప్పు రంగువాఁడని-యాతఁ డా యతిథులతోఁ జెప్పుచుండును. చేతిలోనున్న యనుపపప్పు ముందుఁ గథలోనున్న కాలిన మొక్కజీడిపప్పెక్కువ రుచింపకుండుటచేఁ గాఁబోలు వారామాటలను గణింపకుండెడివారు. తిక్కన సోమయాజిగా రిట్లుండెనని మీ కెట్లు తెలిసినదని యాయన నెవ్వరు నడుగలేదు. అడిగిన యెడలఁ గారణ మాయనకుమాత్ర మేమి తెలియును? అట్లాయనకుఁ దోఁచుట యే కారణము. పింగళి సూరన్నగారికి ముందు దంతములలో నొకటిపొడుగని యొకటిపొట్టి యని చెప్పును. ఆయనకు ఆలాగునఁ గనఁబడుచుండగ నెవరు కాదనఁగలరు? ఒకనాఁడు తాను తనభార్యయుఁ బండుకొని యుండగాఁ దాను "దుర్గా! పోతరాజుగా రెట్లుందురని నీయభిప్రాయ"మని యామె నడిగెను. ఈప్రశ్న యామెకెందులకో బోధపడదు. "పొడుగుగాను, సన్నముగాను నుందురని నేననుకొందునని" యామె బదులుచెప్పెను. భర్తయడిగిన నడుగును గాక! భార్యకీ ప్రత్యుత్తర మెందులకో యంతకంటె బోధపడదు. "అలా

గునఁ గాదుసుమీ. పొట్టిగా నుండును. తగుమాత్రమైన బొజ్జగలిగి యుండును." అని భర్త బదులుచెప్పెను. ఔనని, కాదని, భార్యాభర్త లిట్లొక్కనిముసము సంభాషించుకొన్న మీఁదట భర్త - "నే నన్నమాటయే నిజమగునెడల—నదిగో—గోడబల్లమీఁదఁ బెట్టిన మద్దెలయున్నదే. అది గణగణ మ్రోఁగును" అనుసరి కేదైన యెలుక దానిని గదల్చెనో మఱేమైన జరిగెనో తెలియదు. కాని, మద్దెల గణగణ మ్రోఁగెను. అంత నాతఁడు మహానందమున లేచి మద్దెలను గ్రిందికి దింపి దానికిఁ బూజ లొనర్చి, పోతరాజుగారి మద్దెలయని దానికిఁ బేరిడి పోతరాజుగారి గజేంద్రమోక్షాదిగాథలలోని పద్యములన్నియుఁ గీర్తనములుగాఁ బాడుకొనుచు మద్దెల వాయించుకొనుచుండెను. ఇది జరిగి యిఱువదేండ్లు దాఁటినది. అల్పాహార కాలమునం దీకథ యతిథులకుఁ బ్రతిదినమును జెప్పును. అట్లు కొంతసేపుచెప్పి—

క. "పలికెడిది భాగవతమఁట
పలికించెడి వాఁడు రామ-భద్రుండఁట నేఁ
బలికిన భవహర మగు నఁట
పలికెద వేఱొండుగాథ పలుకఁగ నేలా ?"

యను పద్యమును చదివి "ఆహా! మహానుభావుఁడు! ఎంతమృదులముగా-నెంతలలితముగా-నెంతమనోహరముగాఁ-జెప్పినాఁడో! మా తండ్రి - పోతరాజుగా రిప్పు డెక్కడ నుండునో" యని కన్నుల నీరు జలజల రాల్చుచుండును. ఊఁచబియ్యపుఁ బదనుచేఁ జొంగలు గార్చుచున్న భక్తిప్రియాలకుఁ బోతరాజుగారి కవిత్వ మప్పుడు కావలయునా ?

ఇట్లు కొంతకాల మత్యుచ్ఛ్రయముగా నాసంసారమునకు దినములు జరిగినవి. కాల మొక్కరీతిగాఁ గడచునా? వర్షములు వెనుకఁ బట్టినవి. పంటలు తగ్గిపోయినవి. క్షామము తలచూపినది. అందువలన నతిథులు మఱింతవచ్చుచున్నారు. అందఱకు సంతుష్టిగఁ బెట్టుచునే యున్నాఁడు. అప్పులు చేసినాఁడు-పాటిపెరళ్లమ్మినాఁడు. ఇల్లమ్మినాఁడు. ఇంటిలోఁ బాత్రసామగ్రి నమ్మినాఁడు. కోటప్పకొండ మ్రొక్కుతో సంబంధించిన తన యెడమకాలి వెండి కడియ మమ్మినాఁడు. అమ్మగా మిగిలిన రెండు గేదెలుకూడఁ జచ్చిపోయినవి. ఇంటిలో నేమియు లేదు. మట్టమధ్యాహ్నమగు సరికిద్దఱతిథులు వచ్చినారు. ఇంటిలో నరసోలెడు గింజలు లేవు. అప్పుడు భార్యయొద్ద కాతఁడుపోయి యిప్పుడువచ్చిన యతిథులను బూజించు టెట్లు?—అని యడిగెను. పసపురాచిన దారమును మెడను గట్టుకొని మంగళసూత్ర మిచ్చి "ఇది యమ్మి వారికిఁ గావలయు సామగ్రిని తెండు. అమ్మాయి చల్దియన్నము తినినది. మన మీదినమున భుజింపవలదు. వారికి సాయంకాలము కాకుండ భోజనము పెట్టి పిల్లను దీసికొని రాత్రియెటకైనఁ బోవుద"మని భార్య పలికెను. మంగళసూత్రమునకు రెండు వరాలు కాఁబోలు వచ్చినది. కొంతవ్యయపఱచి యాయతిథులకు సంతుష్టిగా భోజనము పెట్టి శిష్టాన్నము కొంత సాయంకాలమునఁ గూఁతునకుఁ బెట్టి, తాము తినక, వా రారాత్రి యెవ్వరితోడను జెప్పకుండ వెడలి పోవఁ బ్రయత్నించిరి. కాని, యీ యూరనున్న యొక సంపన్నుఁడీ యంశమును గర్ణాకర్ణిగా విని యాయనయొద్ద కారాత్రి వచ్చి "సుబ్బరాజుగారూ! మీకు దుర్దినములు వచ్చినవి. దరిద్రతకంటె దుస్థితి లేదు. మిమ్ము నేను గనిపట్టుకొనును. మీ రెక్కడికిని బోఁకలద"ని చెప్పెను. "ఓయబ్బ! దుష్టదినములు మాత్రము మ మ్మేమి చేయఁగలవయ్యా? దరిద్రము పోతరాజుగారు పడలేదా? ఆయనకంటె మే మెక్కువవారమా? ధర్మబుద్ధిచే నొకరు నాకింత పెట్టఁగ నేను దినువాఁడనుగాను. పోతరాజుగారిని రక్షించిన యొంటిమెట్ట కోదండరామమూర్తి మమ్ముల రక్షింపకుండును? అడవులఁబట్టి పోవుదుము. నాయనా! పోతరాజుగారు "అడవి రక్షలేని యబలుండు వర్ధిల్లు, రక్షితుండు మందిరమునఁ జచ్చు"నని చెప్పినారు. మమ్మడ్డు పెట్టకుము. కాని నా దొక్క కోరిక యున్నది. ఎవ్వరైన నతిథులు వచ్చునెడల నీవు వారిని చేతనగునంతవఱకు నాదరించుచుండుము. అట్లు చేయునెడలఁ బోతరాజుగారు సంతసింతురు అని చెప్పి యాతని నంపివైచి, ఇదివఱకుఁ దానువ్రాసిన తాటాకు గ్రంథములన్నియు నటుకమీఁదఁ బదిలముగా దాఁచి, తాను వ్రాసిన పోతరాజుగారి భాగవతమును దేవతార్చనపుఁ బెట్టెతోఁ గూడ నంగవస్త్రమునఁజుట్టి తలపైఁ బెట్టుకొని, పోతరాజుగారి మద్దెల వీఁపునఁ గట్టుకొని, గంటము మొలలోఁ బెట్టుకొని, కూఁతు నెత్తుకొని, భార్యచేయి పట్టుకొని—

కం. శ్రీకంఠ చాపఖండన
పాకారి ప్రముఖ వినుత, భండన విలస
త్కాకుత్స్థవంశ మండన
రాకేందు యశోవిశాల రామనృపాలా.

—యని పఠించుకొనుచు వెడలిపోయెను.

## II

అది మహమ్మదీయుల రాజ్యము. ఆయూరి పేరేదో తెలియదు. జోడుగుఱ్ఱాల బండిమీఁద నవాబుగారు బయలుదేఱి—'కాసు' తోఁటఁజూచి తిరుగ నింటికిఁ బోవుచున్నారు. ఆదారిలో నొక బ్రాహ్మణుఁడు నిలువఁబడియున్నాఁడు. గుఱ్ఱపుబండి వచ్చుచున్నది. "ఓయబ్బా! ఆఁపవయ్యా బండి! ఒక్కటేపరుగా?" యని బండివాని కాతఁడు కేకవైచెను. బండియాఁపక యాతఁడు తోలుకొని పోవుచుండగా నాబ్రాహ్మణుఁడు గుఱ్ఱపుఁ గళ్లెములను బట్టుకొని బండినాఁపెను. గుఱ్ఱములు బెదరుచున్నవి. కాని వానిని గదలనీకుండ నాతఁడు పట్టుకొనియున్నాఁడు. ముందుఁ గొంతదూరము పోయిన తురుష్క సవారులు వెనుకకుఁ దిరిగిరి. మఱి కొందఱు జనులు మూఁగిరి. నవాబుగారు బండి దిగినారు. ఆయనయొద్ద కాతఁడువెళ్లి "మాయబ్బ! నీవే నఁటయ్యా! ఈ చుట్టుపట్ల పాలాల కంతకును రాజవు? సరేకాని, నాకేమైన భత్య మేర్పాటుచేసి, తాటాకు గ్రంథాలు వ్రాయింపరాదఁటయ్యా! నాకు జరుగుబాటుగను నుండును. నీకు ఖ్యాతిగాను నుండును. సుఖముగాఁ గూరుచుండి వ్రాయుదును. నీ కచ్చేరిలోనికి నన్ను రానీయరని నిన్నుఁ జూచుట కిడకు వచ్చినాను. ఎవరేమి చెప్పుకొందురో వినవచ్చును. బండి నిమ్మళముగాఁ దోలించుకొనరాదయ్యా" యని నవాబుగారితో

ననియెను. బ్రదుకుదెరువుకొఱకుఁ బ్రభుని ప్రథమమున సందర్శించునప్పటి సంభాషణ మిట్లున్నది. పాపము! భటత్వమెఱుఁగునా? ప్రభుత్వమెఱుఁగునా? మన్నన యెఱుఁగునా? మార్దవమెఱుఁగునా? మర్యాదయెఱుఁగునా? మాటతీ రెఱుఁగునా? అయ్యో! పట్టిజానపదుఁడు. రూపమున మోటు. వస్త్రమున మోటు. పలుకున మోటు. పట్టి నిష్కల్మషుఁడు. అమాయకుఁడు. మనసున నొకటి. నోటనొకటి యున్నదా? శుద్ధ సత్యకాలపువాఁడు. ఋషివిగ్రహుఁడు. హరిహరీ! ఇప్పటి యింద్రజాల మహేంద్రజాల మహామహోపాధ్యాయులలోని వాఁడా? ఇప్పటివారిలోఁ గొందఱు సత్యసంధులకుఁ దక్క దఱచుగా నెవ్వరినిఁ జూచినను నొసలు వెక్కిరింపు. నోరిగిలింపు. మొగమెదుట నమస్కారములు. వెనుకఁ దిరస్కారములు. పలుకు తేనెపట్టు- పిడికిలి కోతిపట్టు. పెదవిని మందహాసము హృదయమునఁ జంద్రహాసము. ఆతఁడిట్టి వారిలోవాఁడా? తన యుపకారపుమాట యేదో యెఱుఁగఁడు. ఎదుటివాని కపకారపుమాట యేదో యెఱుఁగఁడు. మనసులో నేది సత్యమని తోఁచునో యది పైకి రావలసినదే. ఆ వచ్చుటలో నొక సాపులేదు- సంతన లేదు. నీటులేదు మాటలేదు. పట్టికట్టపడి కంకరరాతిపాకముతో రావలసినదే! ఆతఁ డనినమాటలు విని నబాబుగారు కొంత నిశ్చేష్టితులై యూరకుండిరి. నబాబుగారివంటి వానిని సుబ్బరాజుగారెట్లు చూడలేదో, సుబ్బరాజుగారివంటి వానిని నబాబుగా రట్లు చూడలేదు. "మాయబ్బ; అదేమి చూపయ్యా!

"కారే రాజులు రాజ్యముల్ గలుగవే- గర్వోన్నతిం జెందరే?
వారేరీ సిరిమూటఁ గట్టుకొని పోవంజాలిరే భూమిపైఁ
బేరైనంగలదే శిబిప్రముఖులున్ బ్రీతి న్యశస్కాములై
యీరే కోర్కుల వారలన్ మఱచిరే! యిక్కాలమున్ భార్గవా"

యని పోతరాజుగారు సెలవిచ్చిరయ్యా! అడుగక యడుగక యఱువదియేండ్లకడిగినానయ్యా! నీ హాలాలన్నియు నా కూరకే యిచ్చినను నా కక్కఱలేదు. ఏదో కొలువుచేయించుకోవయ్యా! ఎందుల కింతయోజన? నీ విచ్చు భత్యము నా కేమియు నక్కఱలేదు వింటివా? పూటకొక్క యతిథి కన్నముపెట్టి మిగిలిన గంజితో నా కూఁతును రక్షించుకొందును. నేను నాభార్యయుఁ బస్తుండెదము. కాదేని కాయయో కసరో తినుచుందుము. మామాట కేమి?" అని బ్రాహ్మణుఁడు పలికెను. ఇంకను నబాబుగారు నిల్వుగ్రుడ్లువైచుకొని చూచుచుండగా "నీతో నా కేమి పోవయ్యా - రాజన్నప్పుడు పోతరాజుగారే రాజుగాని నీ వెక్కడిరాజు వయ్యా" యని యాతఁడు పోఁబోవుసరికి నబాబుగారు భటులకుఁ గనుసన్న చేసిరో యేమో కాని నల్వురుభటులు సుబ్బరాజుగారిని సున్నములోని కెముకలే కుండఁ గొట్టిరి. సుబ్బరాజుగారు రామరామ యనుచు నా దెబ్బలన్నియు నే మాత్రము తిరుగుబాటయిన లేకుండ కన్నయినఁ జిట్లించుకొనకుండ సహించెను. మఱియొక భటుఁడింతలో వచ్చి యాయన జన్నిదమును ద్రెంపఁబోవగ నాతని నెత్తిపై తన గంటము మొదటితోఁ గొట్టెను. వాఁడు గిలగిలలాడుచుఁ గ్రిందఁబడి పోయెను. అంత సుబ్బరాజుగారు కారాగృహముం దుంపఁబడిరి. నవాబుగారు తమ మహలునకుఁ బోయిరి.

## III

స్ఫోటకపువ్యాధులచే విషూచివ్యాధులచే నా మహమ్మదీయ గ్రామమంతయు నిండియున్నది. జనులు కుప్పతిప్పలుగాఁ జచ్చుచున్నారు. బండ్లమీఁద వైచి శవములను దీసికొని పోవుచున్నారు. సుబ్బరాజుగారి కారాగృహమున కొక్క నలువది బారల దూరములో నొక కానుఁగు చెట్టున్నది. అది వీధిప్రక్క నున్నది. దాని క్రిందనే, దుర్గమ్మ యామె కూఁతుతో నివసించుచున్నది. తనకుఁ దనభర్త కన్నము లేకపోయినను ఏజిరుగడమో కట్టెపెండలమో తిని కాలక్షేపము చేయఁగలరు. కాని, అయిదేండ్లపిల్ల యట్లు బ్రదుకఁ గలదా? ఆపిల్లను సంరక్షించుట కామె యెచ్చటనైన దాస్యమున కొప్పుకొని చేయవలయును గదా! ఎక్కడెక్కడఁ దిరిగినను నదుపాయమగు నౌకరి దొఱకలేదు. తుదకొక్కయింట నెల కొక్క వరాజీతమున కొప్పుకొని యాయింటను స్ఫోటకపు వ్యాధిచే బాధపడుచున్న యొక కాంత కుదయమునుండి సాయంకాలము వఱ కుపచారము చేయుట కంగీకరించెను. మాసవేతనములోఁ దీర్చుకొను పద్ధతిమీఁద నొక్కమాడ ముందుగాఁ దీసికొని పిల్లదానికిఁ గావలయు సామగ్రి కొని కుండతోఁ దెల్లవాఱకముందే రవంతవండి, కూఁతునకుఁ బెట్టి దానిని దండ్రిగారాగృహము గుమ్మము వెలుపలవిడిచి తాను సేవకుఁ బోవుచుండును. ఇట్లు పదునైదు దినములు గడవకుండ నామెపిల్లకు జ్వరమువచ్చెను. పుచ్చుకొన్న మాడ కింకను రెండు దినముల సేవబాకి యున్నది. ఋణము తీర్చుకొనకుండ రాదనియు, నుచితముగ నెవ్వరి సొమ్మును దీసికొనఁ గూడదనియు నాజ్వరము తోడనే పిల్లను గారాగృహాంగణమున విడిచి సేవకుఁబోయి యాబాకి తీర్చుకొని, యంతటినుండి సేవకు రాఁజాలనని చెప్పెను. పిల్లకు స్ఫోటకము వచ్చినది. రెండేఁ తాను ఒడ్డు కట్టుకొని యాచెట్టుక్రిందనే వాని చాటునఁ బిల్లను బెట్టుకొని కంటికిమంటికి నొక్క ధారగా నేడ్చుచుండును. తండ్రి, కారాగృహమందు భీష్మస్తవరాజమును జదువుకొనుచుండును. ఇట్లుండఁగాఁ బైఁటచాటున గుడ్డలలోఁ బిల్లను బెట్టుకొని యొక్కనాఁ డుదయమున దుర్గమ్మ కారాగృహమునొద్దకువచ్చి పిల్లను తండ్రికి జూపి యేడ్చెను. ఉదయ మయిదు గంటలకే యాపిల్ల మరణించెను. మృతినొందిన తనకూఁతును రోదనము చేయుచున్న భార్యను గాంచి, కన్నులనుండి జాఱిన యిందుపగింజలంతటి రెండు బాష్పములనట్టె త్రోచివైచి— "ఓయబ్బ! ప్రపంచ మిట్టిదని యెవరెఱుఁగరు? తొందరపడకు. ఒంటిమిట్ట కోదండరాముఁ డిచ్చినాఁడు. ఆయనయే తీసికొన్నాఁడు. ఓయబ్బ! తనసొమ్ము తాను దీసికొనఁ డేమి? పోతరాజుగారి మాటయందు నాకున్నట్లే నీకుఁ బ్రమాణబుద్ధి యున్నది కావునఁ జెప్పెదను.

"మచ్చిక వీరికెల్ల బహుమాత్రము చోద్యము! దేహిపుట్టువుం
జచ్చుచునుండఁ జూచెదరు. చావక మానెడువారి భంగి నీ

చచ్చినవారి కేడ్చెదరు. చావున కొల్లక డాఁగవచ్చునే?
యెచ్చటఁబుట్టె నచ్చటికి నేగుటనైజము ప్రాణికోటికిన్ "

అందువలన నిప్పుడు మన యమ్మ వైకుంఠమున నున్నది. నే నెఱుఁగుదును. నాకు రాత్రియే తెలిసినది." అనెను. ఇంతలో స్ఫోటకపుశవము నచటికిఁ దీసికొని రాఁగూడదు. పోపో యని భటులామెను బెదరించిరి. ఆమెయేడ్చుచు "నాయనలారా! పోవుదును. క్షమింపుఁ"డని భర్తవంకతిరిగి "ఎవ్వరికైన నొకటంక మిచ్చినఁగాని యీపిల్లకుఁ దరువాతికర్మము జరుగదు. నాయొద్ద నేమియు లేదు. నేనే తీసికొనిపోయి నా చేతులతోనే యీ పనిచేయవలయునా?" యని గోలున నేడ్చుచుఁ దటాలునఁ బోయెను. ఆమె యేడ్పుచూచి భర్త గుండెలేకావు-బ్రహ్మాండ గోళమంతయు గడగడవడఁకిన ట్లయ్యెను. నిజమైన యీ పద వచ్చినప్పుడు-అందులో మహాపతివ్రత కాపదవచ్చినప్పుడు — ఆయాపదకన్న కడుపుతోఁ జేరినప్పుడు-పునాదులతోఁ జెల్లగిల్లునట్లు-ప్రకృతి కంపించు ననఁగా నాశ్చర్యమేమి? అంత సుబ్బరాజుగారు—

"లావొక్కింతయులేదు. ధైర్యమువిలోలంబయ్యెఁ బ్రాణంబులున్
ఠావుల్దప్పెను. మూర్ఛవచ్చె తనువున్ డస్సెన్ శ్రమంబయ్యెడిన్
నీవేతప్ప నితః పరం బెఱుఁగ మన్నింపందగుం దీనునిన్
రావే యీశ్వర! కావవే వరద! సంరక్షించు భద్రాత్మకా! "

యను పద్యమును జదువుకొని కొంతశాంతిపడి రామనామ స్మరణ మొనర్చుకొను చుండెను.

## IV

సుబ్బరాజుగారి గంటపుదెబ్బతినిన భటుఁ డిఱువది దినములు బాధపడి మరణించెను. ఖూనీ, నేరము చేసినందులకు సుబ్బరాజుగారిని నవాబుగారింక శిక్షింపవలసి యున్నది. విచారణ కొక్క దినమున నాయనను నవాబుగారి కచ్చేరికి దీసికొనిపోవుట కేర్పాటయినది. వకీలు కావలయునా? దస్తావేజులు కావలయునా? సాక్ష్యము కావలయునా? నవాబుగారి యెదుటనే కాదా నేరము జరిగినది? శ్రీమన్మహాదశమీదినమున విచారణ జరుగనై యున్నది. ఆ యుదయమునను దేవుకొనుచు నాతనిభార్య కారాగృహముసొద్దకు వచ్చి భర్తను గాంచి "నాకీయుదయమున నుండి వాంతులు భేదు లగుచున్నవి. నా తను వీ సాయంకాలమువఱకు నిల్చునని తోఁపదు. నడువలేక యిట్లు దేకుకొనుచు వచ్చితిని. సర్వథా యనుగ్రహ ముంపవలయును." అనిలోఁ యేటఁబడిన గొంతుతోఁ బలికెను. భార్యను గాంచి భర్తకొయ్యవారెను. ఒక్క నిముసమునకుఁ బ్రజ్ఞఁగాంచి యామెసరికిఁ దన పాదముల నాయమశలాకలనుండి యావలకులాఁగి వానిని గన్నులందుఁ జేర్చుకొని-శ్రీరామచంద్ర పరబ్రహ్మణేనమః—యని భార్యయనుచున్నది. భర్తకుఁ గంటివెంట నీటిచుక్కలేదు. భార్యకంతకంటె లేదు. అతిశుష్కమైన వస్తువున కయిన రసమున్నది. అతినీచమైన కార్యమునకైన రసమున్నది. అగ్నిజ్వాలలకైన రసమున్నది. కాని యతిదుఃఖమున రసములేదు "మీ పాదసన్నిధిని నాకు మరణింపవల యుననని యున్నది. కాని యీ వ్యాధిగల నన్నిక్కడఁ గొంతసేపైన నుండనీయరు. భటులు పొమ్మనకుండనే స్వామీ వెడలిపోదును. నమస్కారము." అని యామె దేకుకొనుచుఁబోయెను. ఆమె యేమనుకొనుచుఁ బోయెనో యాయన యేమనుకొనుచుఁ గొట్టులో నుండెనో వారికే తెలియఁదగినది. అంత-

కం. కలఁడందురు దీనులయెడఁ
గలఁడందురు పరమయోగి గణములపాలన్
గలఁడందు రన్నిదిశలను
గలఁడుకలం డనెడి వాఁడు కలడో లేడో.

యని చదువుకొనుచు నిట్లు గలిగిన సందేహమును వెంటనే పరిహరించుకొని.

కం. నీపాదకమల సేవయు
నీపాదార్చకులతోడి నెమ్మి నితాంత
శ్రీపాదకమల సేవయుఁ
దాపసమందార నాకు దయసేయఁగదే.

యని ధ్యానించుకొనుచుండెను. ఇంతలో విచారణకొఱకాయనను గచ్చేరికిఁ దీసికొనిపోవు భటులువచ్చిరి. వారాయనను దీసికొని పోవుచుండఁగ "ఆకానుఁగుచెట్టుక్రింద నన్నొక్కసారి నిలుపవయ్యా! నాభార్యనుచూచి వత్తు" నని వారిలో నొక్కని నాతఁడు కోరెను. వారంగీకరింపక చెట్టుప్రక్కనుండియే యాతనిఁ దీసికొనిపోవుచుండ దుర్గా! దుర్గా! దుర్గా యని సింహగర్జనమునఁ బిలిచెను. పలుకలేదు. ఆమె మరణించెనని నిశ్చయపఱచుకొని కోదండరామ ప్రభూ యని యొక్క కేకవైచి "ఓ కానుగుచెట్టా? నాముద్దను, నా బిడ్డను నేను బోషింపఁగొనలేని దినములలో నీవు నీడనిచ్చి వారిని బోషించితివి. దిక్కుమాలినదైన నాభార్యకళేబరము ప్రక్కనుండియే దానిని జూడకుండ నేను బోవుచున్నాను. నీవట్టిదానవుకావు. నీవింక నామెయొద్దనే కనిపెట్టుకొని యున్నావు. నీవే నాకంటె ధన్యతకలదానవు. నీకుత్తర జన్మమున మహోత్కృష్టమగు జన్మము సిద్ధించునుగాక" యని నడచుచునే చెట్టును దీవించి కచ్చేరికిఁ బోయెను. కచ్చేరిలో విచారణ యేమున్నది? "నీవు మాభటుని గంటముతోఁ గొట్టి చంపితివి-నీకు మరణశిక్ష యేల విధింపఁగూడదో చెప్పుకొందువా" యని నవాబుగారాయన నడిగిరి. "ఓ సుబ్బ! గంటపుదెబ్బకే చచ్చిపోయినాఁడయ్యా! గట్టిగాఁ గొట్టనేలేదయ్యా! మాసుబ్బ! ఎన్నిగ్రంథములు వ్రాసిన గంటమయ్యా! ముందు జన్మమున వాఁడు మంచికవియై పుట్టును. ఈడను మంచివేళ పొందుటకే యాడకుఁ బోయినాఁడని నమ్మవయ్యా! మఱి నన్నేదో చెప్పుమంటి వెందుకు? నన్నడుగు టెందుకు? నీయిష్టము వచ్చినట్లు చేసికోవయ్యా. అడిగియడిగి నీవేమాత్రము చేయఁగలవయ్యా? పోపో" యని కచ్చేరినుండి పోవుటకుఁ బ్రయత్నించఁప భటులాయనను బట్టుకొనిరి. ఇంతగర్వి, ఇంత పొగరుబోతు, నింతదుర్మార్గుఁడు లేఁడని యచ్చటివారంద ఱనుకొనిరి. ప్రజల యభిప్రాయముల సొమ్మనము సౌభాగ్యము నిది. ఈ యంశము సందేహము కాదు. అన్నియంశములందుఁగూడ నిట్టిదే-ఆతని తల నఱుకవలయునని నవాబుగారు భటుల కాజ్ఞాపించెను. "ఓ సుబ్బ! ఇంతేకద!

ఈమాత్రానికి నన్నీడకుఁ బిలిపించు టెందుకయ్యా" యని యాబ్రాహ్మణుఁడు పలికెను. భటు లాతనిని వధ్యస్థానమునకుఁ గొనిపోయిరి. తలారి కత్తి చేతఁబట్టుకొని యాతని మొగము గాంచి గడగడ వడఁకి నేనీపనిని జేయఁజాలనని కత్తి నావలఁ బాఱవైచెను. ఏలనఱుకలేవని నవాబుగా రాతని నడుగ "అతనిరూపము నాకేమో భయంకరముగా నున్నది. నాచేతు లాడకున్న" వని యాతఁడు నవాబుగారి పాదములపైఁ బడెను. "నీవాతనిని నఱుకకుండునెడల నిన్ను ముందు నఱికెంతు" నని నవాబుగా రాతని బెదరించిరి. అంత నాతఁ డేమిచేయఁగలఁడు? గడగడ వడకుచు సుబ్బరాజుగారి కంఠమున బిస్మిల్లా యని కత్తివిసరెను. కంఠము తెగలేదు. మఱియొక్కసారి చొరవతెచ్చుకొని వైచెను. తెగలేదు. "ఓయబ్బ! నీవలనఁగాదయ్యా! భాగవతము తలమీఁదనుండగాఁ దల తెగుననియే యనుకొంటివఁటయ్యా! నీబొందపడ! ఎక్కడనో యడవిమృగమువలె నున్నావు. విను. నీవేమియుఁ గష్టపడకు. వెనుకకు విఱిచికట్టిన నాచేతులు విప్పవయ్యా. భాగవతము తలమీఁదినుండి దింపుదును. తరువాత సులువుగా సుఖముగా నఱుకుదువు కాని- ఎందుకింత రోజన" అని సుబ్బరాజుగారు పలికిరి. చేతులు విప్పుమని నవాబుగారు భటునకు సంజ్ఞచేసిరి. అంత సుబ్బరాజుగారు, కొన్నిపాటి ప్రయాణమునుండి యానిముసమువఱకుఁ దలమీఁదనే కట్టుకొనియుంచిన భాగవతమునుదీసి, కన్నులకద్దుకొని దూరముగ నుంచి దానికిఁ బ్రదక్షిణమొనర్చి సాష్టాంగ మాచరించి లేచి కోదండరామప్రభూ! యని బ్రహ్మాండకటాహము పగులునట్లొక్క కేకవైచి చాపచుట్టగఁ గ్రిందఁబడి ప్రాణములు విడిచెను. కత్తితో భటుఁడింక నఱుకుట యెందుకు? ఆతఁ డెట్లు మరణించెనో? యని యందఱ కాశ్చర్యముగా యున్నది. పరీక్షించిచూడఁగ నాతనినోటినుండి రక్త మొలికినది. పిడుగుపడినట్లు కోదండరామప్రభూ యని యాతఁడు వైచిన కేకతో గొంతులోని రక్తనాళము తెగి యారక్తపుఁజుక్కలు వాయుద్వారమునఁ బోవుటచే నూఁపిరియాడక నిముసములో మరణమీతనికి సిద్ధించినదని యటనున్న వైద్యుఁడు Scientific Explanation (శాస్త్రీయ సమాధానమును) చెప్పి, తన పాండిత్య మందఱకుఁ దెలిసినదో లేదోయని యటునిటు చూచెను. పరమాత్ముని యాజ్ఞ యయినది కావునఁ బ్రాణములు దేహమును వదలిపోయిన వని చెప్పఁగ నందఱకును దెలిసినమాట.

సుబ్బరాజుగారు మరణించిరనుమాట చెవినిబడఁగనే కన్నుల కేదైనఁ గనబడెనో కడుపులో నేదైన గుబులుపుట్టెనో కాని గడగడవడఁకి పాఱున నవాబుగా రేడ్చిరి. వారికంటె ముందుగానే కాఁబోలు వారి భటు లేడ్చిరి. అచ్చటి ప్రజలందఱికంటె ముందుగాఁ గాఁబోలు నేడ్చిరి. అంద ఱేడ్చుచున్నారు. ఎందుల కేడ్చుచున్నారో యెవ్వరు నెఱుఁగరు! ఏది? ఆ సమయమున నెవ్వరికైన మతి యున్నదా? చైతన్యము లున్నదా? గోలుమన్న రోదనముతప్ప నంతకంటె నేమియు లేదు. అంతయుఁదీఱిన తరువాత నేడ్చిన లాభమేమి? సుబ్బరాజుగారికథ విన్నవారికే కన్నులు చెమ్మగిల్లవలసి యుండఁగ నాయనకథను జూచినవారికిఁ గడుపు చెఱువయ్యెననఁగ నాశ్చర్యమేమి! నవాబుగారేమో రామభక్తుఁడైనాఁడఁట. అగుఁగాక. రామభక్తు లెందఱులేరు. వారిలో నాతఁడొకఁడు. సదా కోటి జంగాలలో నొక బోడిలింగము లెక్కయేమి? ఆర్యావర్తదేశమున నారామచంద్రమూర్తి మహాత్మ్యమెఱుఁగని నరుఁ డెవ్వఁడు? నరునివఱ కెందులకు? కోతినడుగు-కొండముచ్చునడుగు-కాకినడుగు- గ్రద్దనడుగు అంతవఱకుఁ గూడ నెందులకు? చెట్టునడుగు - పుట్టనడుగు - జాతి నడుగు-అప్పనడుగు-దేశమంతటను రామనామము శతకోటి జిహ్వలతో మాఱుమ్రోఁగుచున్నది. రాముఁడు లేనిచో టేది? రాముని గూర్చి యొకానొకఁ డిట్లు పలికినాఁడు.

సీ. వీథి పురాణంపు వేదికపై నీవు,
పారాయణపుఁ బీఁటపైని నీవు
దృశ్య ప్రబంధంపుఁ దెరలసందున నీవు,
మృతివార్త శ్రుతిఁ బడ్డ యెడను నీవు,
గొల్లసుద్దుల తేకు డోల్లలందున నీవు,
యక్షగానపుఁ జిందు లందు నీవు
చండాలుబుజముపై మెండితంబుర నీవు,
తోలుబొమ్మలసంత గోల నీవు,
పడుకగదుల గోడల నీవు భక్తహృదయ
రసనలను నీవు యాయావరతను నీవు-
సృష్టినీమయమో? నీవు సృష్టిమయమొ?
యెట్లయిన నేమి? రామ! రక్షింపుమయ్య!

# మన పౌరుషము!!

౧

పలుకు లాకాశమున కంటును
పనులు గుంటపువులు బూయును
నిలుకడ యొక్కింత లేదుగదా!
మన పౌరుషమునకు
బలపు సాలపులు బట్టబీతు లయ్యెన్.

౨

ధీరులా, మఱి వీరభద్రులా
భీరులో ఉత్తరకుమారులా
కోరికలఁ బడగూల్ప లేముగదా!
మన పౌరుషములకు
ఊరకను నిఁకఁ ద్యాగ మలవడునే?—

3

సత్యసంపద సాత్వికత్వము
నిత్యమాత్మయు ననెడిజ్ఞానము
భృత్యభావము మాన్ప లేదుగదా!
మన పౌరుషములకు
జాత్యభిజ్ఞానంబె లేదుగదా!!

—విజయాభిలాషి